APTEL/2008/28200

## తీన్మార్ మల్లన్నను అనర్హుడిగా ప్రకటించాలి

ఖమ్మం : ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు తీన్మార్ మల్లన్నను అనర్హుడిగా ప్రకటించాలని వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్కా జడ్సన్ ఖమ్మం కలెక్టరేట్లో బైఠాయించి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో తీన్మార్ మల్లన్న ఓటర్లను బ్లాక్మెయిల్ చేసేలా వ్యవహరించారని తెలిపారు. 'శాసనమండలికి పంపుతారా..? స్మశానానికి పంపుతారా..? అని వ్యాఖ్యానించారని ఆరోపించారు. ఇదే అంశంపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జాను, ఖమ్మంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కలిసి ఫిర్యాదు చేసిన చర్యలు లేవని వెల్లడించారు.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## వరి కొయ్యలు తగలబెడితే జరిమానా

హైదరాబాద్, మే 17 : వరి కొయ్యలు కాల్చే రైతులకు జరిమానా విధించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం పలు అంశాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి రైతుకు పంటల బీమా ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని, విధి విధానాలు రూపొందించాలని పేర్కొన్నారు. మొదటి విడత పంటనష్ట పరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తయినందున, రెండోవిడత (ఏప్రిల్), మూడోవిడత (మే) జరిగిన పంట నష్ట వివరాలను వేగంగా అందించాలని పేర్కొన్నారు. పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి ఈ నెలాఖరుకు రిపోర్ట్ వచ్చేలా చూడాలని కోరారు. మార్ఫెడ్ ద్వారా మక, జొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్లను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

సంపుటి: 16 సంచిక : 19 కరీంనగర్ శనివారం, మే 18, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు

# నేడే తెలంగాణ కేబినేట్ సమావేశం

## కీలక నిర్ణయాలు తీసుకోనున్న మంత్రి మండలి

మే 18వ తేదీన రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది , రైతు రుణమాఫీతోపాటు, రాష్ట్ర ఆదాయం పెంపు, వర్షాకాల సీజన్ లో చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ ప్రధానంగా చర్చించనుంది. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతుంది. రాష్ట్ర సచివాలయంలో మే 18వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది , రైతు రుణమాఫీతోపాటు, రాష్ట్ర ఆదాయం పెంపు, వర్షాకాల సీజన్ లో చేపట్టాల్సిన చర్యలపై కేబినెట్ ప్రధానంగా చర్చించనుంది. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు చర్చ జరుగుతుంది. మే 18వ తేదీ శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. లోక్‌సభ ఎన్నికల కారణంగా కేబినెట్ సమావేశం నిర్వహించక చాలా రోజులు అయ్యింది. దీంతో ఈ కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా రాష్ట్ర పునర్విభజన జరిగి పదేండ్లు పూర్తి కానుండటంతో, పునర్విభజన చట్టానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న అంశాలు, తెలంగాణ, ఏపీ మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై కేబినేట్‌లో చర్చించనున్నారు. 9,10 షెడ్యూల్ లోని ఆస్తులపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆగస్ట్ 15లోపు రైతుల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ కోసం దాదాపు రూ. 40 వేల కోట్లు అవసరం కాగా, అందుకు సంబంధించిన నిధుల సమీకరణపై కేబినెట్‌లో చర్చించనున్నారు. ఇందుకు సంబంధించి రైతు కార్పోరేషన్ ఏర్పాటు చేసే ఆలోచనలో



ప్రభుత్వం ఉంది..దీంతో ఈ సమావేశంలోనే రైతు కార్పోరేషన్ పై నిర్ణయం తీసుకోనుంది. అలాగే ధాన్యం కొనుగోళ్ల పురోగతిని కేబినెట్ సమీక్షించనుంది. జూన్ నెల అరంభం నుంచి ఖరీఫ్ పంట సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు, నీటి ప్రణాళికపై చర్చ జరుగనుంది. పెరిగిన ఖర్చుకు తగ్గట్టుగా రాష్ట్ర ఆదాయం పెంచుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి ఆదాయ మార్గాలను వెతికే పనిలో పడింది రాష్ట్ర సర్కార్. రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపుతో పాటు వనరుల సమీకరణకు తీసుకోవలసిన చర్యలపై కేబినెట్‌లో చర్చిస్తారు. కుంగిపోయిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల రిపేర్లకు సంబంధించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇటీవలే మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. దీంతో నివేదికలోని సిఫారసులు, తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించాలని కేబినెట్ నిర్ణయించే అవకాశముంది. జూన్ నెల నుంచి కొత్త విద్యాసంవత్సరం ఆరంభంకానుండడంతో స్కూల్స్, కాలేజీల ప్రారంభానికి ముందే తీసుకోవల్సిన జాగ్రత్తలపై కేబినెట్‌లో చర్చించనున్నారు. ఇవే కాకుండా చాలా రోజులుగా పెండింగ్ లో ఉన్న మరికొన్ని అంశాలను కేబినెట్‌లో చర్చించనున్నారని సమాచారం.

# దంచికొడుతున్నవానలు..

## ఆగమైన అన్నదాతలు



పంట వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చేవరకు, చిన్నపాటి యుద్ధాన్ని చేసే రైతన్న.. తీరా పంట చేతికి వచ్చాక దళారుల దగ్గర పోరాడలేక ఓడిపోతున్నాడు. తాజాగా అకాల వర్షాలు రైతన్నను నిండా ముంచేస్తున్నాయి. చేతికందొచ్చిన పంట కళ్లెదుటే మట్టిపాలు కావడంతో గుండెలు బాదుకుంటున్నారు అన్నదాతలు. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో భోరుమంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్దఎత్తున ధాన్యం వర్షార్పణమైంది. వానల నుంచి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు రైతులు. దంచికొడుతున్న వానలు అన్నదాతలను నట్టేట ముంచాయి..నోటి కాడి బుక్క నీటిపాలడంతో రైతన్నలు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. కళ్ళాల్లో ఆరబోసిన ధాన్యం వరదల్లో కొట్టుకుపోతుంటే, రైతన్న గుండె చెరువు అవుతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో గతవారం రోజుల నుండి కురుస్తున్న వడగండ్ల వానల ప్రభావంతో వివిధ పంటలకు ఊహించిన విధంగా నష్టం వాటిల్లింది. వేసవిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం అన్నదాత గుండె చేరువయ్యేలా చేసింది. కరువు మేఘాలు వెక్కిరిస్తున్నా కష్టాలకు ఎదురీది పంటలు సాగు చేసిన రైతులు ఇప్పుడు తల్లడిల్లిపోతున్నారు.. పగబట్టిన ప్రకృతి రైతులు కుమిలి పోయేలా చేస్తోంది. చేతికి వచ్చిన పంట అమ్ముకునే సమయంలో దరిద్రపుగొట్టు వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. వడగండ్ల వానలు రైతులకు ఊహించని విధంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. వడగండ్ల వానల ప్రభావంతో వరి పంటకు ఊహించని విధంగా నష్టం వాటిల్లింది..వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో వరి పంట మొత్తం వర్శర్పణమైంది.

## మాకు 'హ్యాట్రిక్' ఖాయం: మోదీ ధీమా



బారాబంకీ: రాయబరేలి ప్రజలు ప్రధానిని ఎన్నుకుంటారంటూ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పడాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం 'హ్యాట్రిక్' సాధించి తీరుతుందని అన్నారు. 'ఇండియా' కూటమి నేతలు ఒక్కొక్కరే జారుకుంటున్నారని అన్నారు. "సమాజ్‌వాదీ పార్టీ రాజకుమారుడు (అఖిలేష్ యాదవ్) ఒక కొత్త ఆంటీ (మమతా బెనర్జీ) గొడుగు కింద చేరారు. ఆ కొత్త ఆంటీ పశ్చిమబెంగాల్‌లో ఉంది. మీకు బయట నుంచి మద్దతు ఇస్తామని ఆ కొత్త ఆంటీ ఇండియా కూటమికి చెబుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. దేశాన్ని మెరుగుపరచేందుకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఒకవైపు, దేశంలో అస్థిరత సృష్టించేందుకు ఇండియా కూటమి ఒకవైపు ఉందని, ఎన్నికలు నడుస్తున్న కొద్దీ ఇండియా కూటమి నేతలు ఒక్కొక్కరే కూటమి నుంచి జారిపోరుతున్నారని చెప్పారు. కేంద్రంలో రాబోయే కొత్త ప్రభుత్వంలో పేదలు, యువకులు, మహిళలు, రైతుల కోసం ఎన్నో పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోనున్నామని మోదీ చెప్పారు. జాతీయ ప్రయోజనాలకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే అంకితమైందని చెప్పారు.

## భారీ వర్షాల దృష్ట్యా.. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




హైదరాబాద్ మే 17, తెలంగాణ నుండి ఫోకస్ : రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న దృష్ట్యా.. రాష్ట్ర రహదారుల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇవ్వాల సచివాలయంలో వర్షాలవల్ల దెబ్బతింటున్న రహదారుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అత్యవసర సమావేశం నిర్వహించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. టీఆర్బి స్పెషల్ సెక్రెటరీ విజయేందిరబోయి, ఈఎన్సీ ఐ. గణపతిరెడ్డి, రీజినల్ ఆఫీసర ఎన్ హెచ్ ఎ ఐ రీజినల్ ఆఫీసర్ రజాక్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో వర్షాల వల్ల రోడ్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తుగా తీసుకోవల్సిన అత్యవసర చర్యపై చర్చించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారులపై నిత్యం జరుగుతున్న ప్రమాదాల వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నందున తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఈ రహదారిపై 17 బ్లాక్ స్పాట్స్ లను గుర్తించినందున.. వాటివద్ద తగు చర్యలు చేపట్టి ప్రమాదాలు అరికట్టాలని ఆధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న ఇతర జాతీయ రహదారుల నిర్మాణ పనుల స్థితిగతులప ఎన్ హెచ్ ఐ మరియు రాష్ట్ర రాహదారుల శాఖ అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు కు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. "రీజినల్ రింగ్ రోడ్డు" ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం 2021లో మంజూరీ చేసినప్పటికి.. ఇప్పటికీ నిర్మాణం మొదలుకాకపోవడం వల్ల రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేకపోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో సగ భాగం ఆవరించి ఉండే రీజినల్ రింగ్ రోడ్డు లాంటి ప్రతిష్టాత్మకమైన నిర్మాణాల్లో ఎలాంటి అలసత్వం లేకుండా పనిచేస్తే రాష్ట్రం అభివృద్ధి బాటపడుతుందని అన్నారు. యుటిలిటీ ఛార్జీలు చెల్లించమని గతప్రభుత్వం లేఖ రాసినందువల్ల ప్రాజెక్టు ఆగిపోయే ప్రమాదం ఏర్పడితే తాను, గౌరవ ముఖ్యమంత్రిగారు స్వయంగా 363.43 కోట్ల రూపాయల యుటిలిటీ ఛార్జీలను చెల్లిస్తామని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారిని, ప్రధాని నరేంద్ర మోదీ గారిని కలిసి లేఖ ఇవ్వడంతో పాటు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తే.. తామే (కేంద్ర ప్రభుత్వమే) యుటిలిటీ ఛార్జీలను చెల్లిస్తామని గడ్కరీ గారు ఆమోదం తెలిపారని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

## ముమ్మాటికీ కక్ష సాధింపే: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను రాజకీయ కక్షతో బీజేపీ జైల్లో పెట్టిందని ఆ పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్ ఆరోపించారు. ఢిల్లీ తీహార్ జైలో ఉన్న ఎమ్మెల్సీ కవితను శుక్రవారం వీరు పరామర్శించారు. అనంతరం తెలంగాణ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టి బీజేపీ సర్కారు వేధిస్తోందని విమర్శించారు. దేశంలో వేధింపుల పాలన సాగుతోందని దుయ్యబట్టారు. కేసులకు భయపడబోమని చెప్పారు."కవితపై పెట్టిన కేసు పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో పెట్టినట్టు స్పష్టంగా అర్థమవుతుంది. మొదట సాక్షి అన్నారు, తర్వాత అనుమానితురాలు అన్నారు.. అనంతరం నేరుగా అరెస్టు చేశారు. ఈడీ కేసులో జ్యూడిషల్ రిమాండ్ లో ఉండగా సీబీఐ కేసులో అరెస్టు చేయడం కక్ష సాధింపు కాక మరేంటి? మనీలాండరింగ్ కేసులో తనపై మోపిన అభియోగం నిజం కాదని నిరూపించుకునే బాధ్యత నిందితులపైనే ఉంటుంది. ఈ ఒక్క లొసుగును ఆధారంగా చేసుకుని ఈడీ వేధింపులకు పాల్పడుతోంది. ఈ కేసులో మనీలాండరింగ్ ఎక్కడ జరిగింది? ఎక్కడైనా నగదు స్వాధీనం చేసుకున్నారా? అలాంటప్పుడు మనీలాండరింగ్ చట్టాన్ని ఎలా ప్రయోగిస్తారు? ఈ మొత్తం వ్యవహారంలో లంచం డిమాండ్ చేసినట్టు ఎక్కడా లేదు.

## బీజేపీ కుట్రలో పావులా స్వాతిమాలివాల్.. ఆమెపై దాడి అబద్ధం : ఢిల్లీ మంత్రి అతిషి




కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై తీహార్ జైలు నుంచి బయటికి రావడాన్ని బీజేపీ ఓర్వలేకపోతున్నదని ఆప్ సీనియర్ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిషి విమర్శించారు. కేజ్రీవాల్‌కు చెడ్డపేరు తేవడం కోసం బీజేపీ రకరకాల కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. ఆ కుట్రలో భాగంగానే ఈ నెల 13న స్వాతి మాలివాల్‌ను కేజ్రీవాల్ నివాసానికి పంపించారని అన్నారు. బీజేపీ కుట్రలో స్వాతి మాలివాల్ పావులా మారిందని మండిపడ్డారు. వాస్తవానికి సీఎం కేజ్రీవాల్‌ను దోషిని చేయాలని వాళ్లు కుట్ర పన్నారని, కానీ గొడవ జరిగిన సమయంలో కేజ్రీవాల్ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అతిషి వ్యాఖ్యానించారు. అప్పాయింట్‌మెంట్ తీసుకోకుండానే స్వాతిమాలివాల్ కేజ్రీవాల్ నివాసానికి వెళ్లారని, అప్పాయింట్‌మెంట్ కాపీ చూపించమని భద్రతా సిబ్బంది అడిగడంతో వారితో గొడవ దిగారని ఆరోపించారు. సోఫాలో దర్జాగా కూర్చుని పోలీసులను బెదిరించారని చెప్పారు. జోక్యం చేసుకున్న విభవ్ కుమార్‌తో కూడా ఆమె దుర్భాషలాడారని అన్నారు. పైగా విభవ్ కుమార్ తనపై దాడి చేశారని స్వాతి మాలివాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారని, తనను కాలితో తన్నాడని, బట్టలు చించాడని, తలను టేబుల్‌కేసి కొట్టాడని తన ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. వాస్తవానికి ఆమెపై దాడి అనేదే జరగలేదని చెప్పారు. ఇవాళ బయటికి వచ్చిన వీడియో క్లిప్పింగే అందుకు నిదర్శనమని అన్నారు. ఆమె ఒంటిపై ఎలాంటి గాయాలు కూడా లేవని చెప్పారు. కాగా ఢిల్లీ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఈడీ ఈ ఏడాది మార్చి 21న కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది.

## నిజామాబాద్‌లో గెలిస్తే అర్జునుడిని, ఓడితే అభిమాన్యుడినని: కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి



నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్‌ను నిలువరించడాని బీజేపీ, పార్టీలు కుట్ర పన్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి ఆరోపించారు. జగిత్యాలలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో పోటీ చేయడం పద్మవ్యూహంలో చిక్కుకోవడమేనని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో గెలిస్తే అర్జునుడిని, ఓడితే అభిమాన్యుడినని అన్నారు. గెలిచినా, ఓడినా జగిత్యాల ప్రజల అభిమానం చాలని.. తనను రాజకీయ జన్మనిచ్చింది జగిత్యాలని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ఆయన తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. "బీజేపీ సిద్ధాంతం, ఆర్థికప్రణాళిక లేని పార్టీ. మతవిద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయంగా పబ్బం గడుపుకునే పార్టీ బీజేపీ. తెలంగాణలో అమలయ్యే ఏ ఒక్క పథకం అయినా బీజేపీ పాలిత రాష్టాల్లో అమలవుతుందా? పార్టీ నాయకులు రైతు దీక్షల పేరిట ధర్నాలు చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది.

# మెదక్ లో పెరిగిన పోలింగ్ ఎవరికి లాభం... ఎవరికి నష్టం



P Venkatram Reddy Neelam Madhu Mudiraj M Raghunandan Rao

**మెదక్, మే :** పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి అందరి దృష్టి ఆ నియోజకవర్గంపైనే ఉంది. అక్కడ టికెట్ ఎవరికి ఇస్తారు.. బరిలో ఎవరు నిలుస్తారు.. ఇలా చాలా చర్చ జరిగింది. పోలింగ్ ముగిసింది.. ఇక ఇప్పుడు ఆ పార్లమెంట్ స్థానంలో ఏపార్టీ జెండా ఎగరేస్తుంది? ఏ అభ్యర్థి గెలిచే అవకాశం ఉంది? ఇలా కొత్త చర్చ జరుగుతోంది. ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి ఎంతోమందిని ఆకర్షించిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో తాజాగా ఇప్పుడు గెలిచేది ఎవరు అనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది. మెదక్ పార్లమెంటుపై ఇంత చర్చ జరగడానికి కారణం గతంలో ఇక్కడ రాజకీయ ఉద్దండులు ఎంపీ బరిలో నిలిచి దేశ రాజకీయాలను మర్చారు. మెదక్ పార్లమెంట్ అంటేనే ఒక మినీ ఇండియా. వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివసిస్తూ ఉంటారు. ఇక్కడి నుండి ఇందిరా గాంధీ ఎంపీగా పోటీ చేసి దేశ ప్రధాని కూడా అయ్యారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇక్కడి నుండి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అందుకే ఈ స్థానానికి అంతటి క్రేజ్. మొన్న జరిగిన ఎంపీ ఎన్నికల్లో ఈ మెదక్ పార్లమెంట్ నుండి బీఆర్ఎస్ నుండి వెంకట్ రాం రెడ్డి.. కాంగ్రెస్ నుండి నీలం మధు.. బీజేపీ నుండి రఘునందన్ బరిలో నిలిచారు. ఈ ముగ్గురు కూడా ఎన్నికల్లో గెలవడానికి తీవ్రంగా కృషి చేసారు. ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు కూడా వారి అభ్యర్థుల గెలుపుకోసం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఎలాగైనా సరే మెదక్ పార్లమెంట్?పై జెండా పాతలని కసితో పనిచేశాయి మూడు ప్రధాన పార్టీలు. అందుకే చివరికి వరకు ఇక్కడ త్రిముఖ పోరే కొనసాగిందిదీనికి తోడు ఈసారి పోలింగ్ పర్సంటేజ్ కూడా బాగా పెరిగి.. 75.90 పోలింగ్ నమోదు అయ్యింది. గత ఎన్నికల్లో జరిగిన పోలింగ్ పర్సంటేజ్?తో చుస్తే ఈసారి 3.38 శాతం పెరిగింది. పెరిగిన పోలింగ్ ఎవరికి ప్లస్ అవుతుంది. ఈ త్రిముఖ పోరులో ఎవరు గెలుస్తారు అనే దాని పై బెట్టింగ్?లు కూడా జోరుగా నడుస్తున్నాయి. మెదక్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా అందులో ఆరు స్థానాలను బీఆర్ఎస్ పార్టీ గెలిచింది. ఒక మెదక్ అసెంబ్లీ మాత్రం కాంగ్రెస్ దక్కించుకుంది. మొదటి నుండి కూడా బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఇక్కడ నల్లేరు మీద నడకే అనే ప్రచారం జరిగింది. కానీ కాంగ్రెస్, బీజేపీ కూడా ఈ సీట్?ను చాలా సీరియస్ గానే తీసుకున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ మెదక్ సీట్ దక్కించుకోవాలని కసిగా పనిచేసింది. దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన రఘునందన్ మెదక్ ఎంపీగా గెలవాలని గట్టిగా పనిచేశారు. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న మెదక్ పార్లమెంట్ స్థానంను దక్కించుకివడానికి కాంగ్రెస్, బీజేపి పార్టీలు బాగానే కృషి చేసాయి. అంతే స్థాయిలో బీఆర్ఎస్ పార్టీ కూడా వ్యూహాలు చేస్తూ ముందుకు సాగింది. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం మాజీ మంత్రి హరీష్ రావు అన్ని తానై ప్రచారం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ పార్లమెంటు పరిధిలో తన బస్సు యాత్రను నాలుగు నియోజకవర్గాల్ల కవర్ అయ్యేలా ప్లాన్ చేసి, ప్రచారం నిర్వహించారు. ఇక మెదక్ పార్లమెంట్ పరిధిలో కీలకమైన నియోజకవర్గం సిద్దిపేట నియోజకవర్గం. ఇక్కడి ప్రజలు ఏ పార్టీ వైపు నిలిచారు.? అనే చర్చ జోరుగా సాగుతోంది. తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకున్న నాటి నుంచి మెదక్ పార్లమెంట్?కు జరిగిన ఎన్నికల ఫలితాలను గమనిస్తే సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు తీర్పే కీలకంగా ఉంటుంది. సిద్దిపేట ప్రజలు ఏ పార్టీ వైపు నిలిస్తే ఆ పార్టీ గెలుపొందడం విశేషం. ఆ సెంటిమెంట్ దృష్ట్యా తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కేసీఆర్ చివరి సభను ఇక్కడే ఏర్పాటు చేశారు. సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు ఏ పార్టీ వైపు నిలిచారన్న అంశంపై జోరుగా బెట్టింగ్?లు సాగుతున్నాయి. మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేట నియోజక వర్గంలో 2,37,591 మంది ఓటర్లకు గాను 1,74,969 (73.64శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో 2,00,125 మంది ఓటర్లకు గాను 1,64,952(82.42 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# క్యాంప్ పాలిటిక్స్ షురూకీలక నేతల వరుస భేటీలు




**హైదరాబాద్, మే :** తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు పూర్తైపోయాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక నుంచి పూర్తి స్థాయిలో పరిపాలనపై దృష్టిపెడుతానని చెబుతున్నారు. రుణమాఫీ,కాంగ్రెస్ హామీల పూర్తిస్థాయి అమలు, మండలాలు, జిల్లాల రేషనైలేషన్ వంటి అంశాలపై ఫోకస్ పెడుతానని అంటున్నారు. అయితే టీ-కాంగ్రెస్ బాస్‌గా,రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చేసిన ఈ కామెంట్స్ సంగతి అటుంచితే..ఆ పార్టీలో కొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు,మంత్రి వర్గానికి చెందిన కొందరు ముఖ్యుల వ్యవహార శైలితో అప్పుడే కాంగ్రెస్‌లో క్యాంపు రాజకీయాలు మొదలయ్యాయనే చర్చ జోరుగా సాగుతోంది. పార్టీకి సంబంధించిన కీలక నేతలు రహస్యంగా భేటీ అవుతుండడంతో..ఈ ప్రచారానికి మరింత ప్రయార్టీ ఏర్పడినట్లైంది.రాష్ట్రంలో పార్లమెంట్ ఎలక్షన్స్ ముగిసిన వెంటనే రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,మరో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆయన స్వంత ఊరు ధన్వాడలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారివురు సుదీర్ఘ మంతనాలు జరిపారు. అదే టైంలో ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలతో పాటు తన అనుయాయులతో కేరళ వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం మంత్రుల భేటీలు,టూర్ల గురించి అస్సలు మాట్లాడడం లేదు. ఎన్నికలు పూర్తైనందున ఇక నుంచి పరిపాలనపైనే పూర్తిస్థాయిలో నజర్ పెట్టనున్నట్లు చెప్పుకొస్తున్నారు. అయితే రేవంత్ రెడ్డి ఈ రకమైన స్టేట్ మెంట్స్ ఇస్తున్నప్పుడు..భట్టీ-దుద్దిళ్ల భేటీ,పొంగులేటి కేరళ టూర్ వెనక ఉన్న మతలబేంటి అనే అంశమే ఇప్పుడు రాజకీయంగా హాట్ టాపిక్ మారింది.లోక్ సభ ఎన్నికలకు ముందు టీ-బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తామేమీ కూల్చబోమని..కానీ,దాని అంతల అదే కూలిపోతే మాత్రం మేమేం చేయలేమని చెప్పుకొచ్చారు. ఇక రెండు రోజుల క్రితం బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కూడా కీలక వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. రేవంత్ సర్కార్ ఆగస్టు సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చని వెల్లడించారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఇవే సంకేతాలిచ్చారు. దీంతో తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు పూర్తికాగానే..కాంగ్రెస్ సర్కార్‌కు ఇబ్బందులు తప్పకపోవచ్చనే ప్రచారం జోరుగానే ఉంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న మంత్రులు కూడా క్యాంపు రాజకీయాలు నడుపుతుండడంపై ఆసక్తికర చర్చ మొదలైంది. పొంగులేటి కేరళ వెళ్లడం..విక్రమార్క,శ్రీధర్ బాబు భేటీ కావడంతో..అప్పుడే సర్కార్‌లో లుకలుకలు మొదలయ్యాయనే టాక్ వినిపిస్తోంది. వెరసి టీ-బీజేపీ నేతల స్టేట్ మెంట్లు..ఇటు అమాత్యుల వరుస భేటీలతో రేవంత్ సర్కార్‌కు ఏదో ఒక రకంగా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడవచ్చనే డిస్కషన్ మాత్రం జరుగుతోంది.అయితే ఇదే అంశాన్ని టీ-పీసీసీ నేతల వద్ద ప్రస్తావించినప్పుడు మాత్రం తమ పార్టీలో అలాంటి క్యాంపు రాజకీయాలేం నడవడం లేదని కొట్టిపారేస్తున్నారు. కేవలం రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున పొంగులేటి విడిది కోసం కేరళకు వెళ్లి ఉంటారని చెబుతున్నారు. అలాగే భట్టివిక్రమార్క-దుద్దిళ్ల శ్రీధర్ బాబు భేటీ వెనక కూడా అంతలా అంతర్యమేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. అయితే కాంగ్రెస్ నేతల వివరణలు ఎలా ఉన్నా..మున్ముందు ఏదో జరగబోతుందనే అంచనాను రాజకీయాలు విశ్లేషకులు వేస్తున్నారు. అయితే ఎవరి ఎక్స్‌పెక్టేషన్స్ ఎలా ఉన్నా..చూడాలి మరీ మరికొద్ది నెలల్లో ఏం జరగనుందనేది.

# జొన్న పంటలో పుష్కలంగా ఇథనాల్



**వరంగల్, మే :** చాలామంది తెల్ల, పచ్చ జొన్నలు తమ ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆహారంలో భాగం చేసుకుంటారు. ప్రస్తుతం దేశంలో మరో రకం జొన్న పంట సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధలు చేస్తున్నారు. అయితే తియ్యగా ఉండే ఈ రకం జొన్న తినడానికి ఉపయోగించరు. ఇందులో ఇథనాల్ ఎక్కువగా లభిస్తుంది. దీన్ని పెట్రోల్‌లో కలిపేందుకు వినియోగిస్తున్నారు. పెట్రోల్ దిగుమతిని తగ్గించి, పర్యావరణాన్ని రక్షించేందుకు పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలని కేంద్ర లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 12 శాతం ఇథనాల్ మాత్రమే పెట్రోల్‌లో కలుపుతున్నారు. ఇప్పటిదాకా.. చెరకు నుంచి తీసిన ఇథనాల్‌ను మాత్రమే వాడుతున్నారు. చెరకు విస్తీర్ణం రోజురోజుకూ తగ్గిపోతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. అందుకే ఇథనాల్ ఉత్పత్తి కోసం శాస్త్రవేత్తలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. తియ్యటి జొన్న పంటలో ఇథనాల్ పుష్కలంగా లభిస్తుందని గుర్తించి.. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) తోడ్పాటుతో దీనిని ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఐకార్‌కు అనుబంధంగా పనిచేసే హైదరాబాద్‌లో ఉన్న భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ.. దేశంలో తియ్యటి జొన్న విత్తనోత్పత్తి కోసం సాగు చేస్తోంది.ఇందులో భాగంగానే వరంగల్ రీజియనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ లో కూడా రెండెకరాల్లో 'జైకార్ రసీలా' అనే రకం జొన్నను సాగు చేశారు. ఇప్పుడు అది కోతకు వచ్చింది. దేశవ్యాప్తంగా ఈ పంట సాగుకు ఐఐఎంఆర్ శాస్త్రవేత్త డా.ఏవీ ఉమకాంత్ నేతృత్వం వహిస్తున్నారు. ఆయన తన బృందంతో కలిసి బుధవారం వరంగల్‌లో సాగైన ఈ జొన్న పంటను పరిశీలించారు.మరో విషయం ఏంటంటే.. ఈ తియ్యటి జొన్న నుంచి ఇథనాల్‌ను బయటికి తీసేందుకు ప్రత్యేకంగా ఎలాంటి యంత్రాలు అవసరం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# పారదర్శకంగా విత్తనాల విక్రయం చేపట్టాలి - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




పెద్దపల్లి, మే 17: జిల్లాలో పారదర్శకంగా విత్తనాల విక్రయం ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత విత్తన, ఎరువుల డీలర్లకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రాబోయే వానాకాలం విత్తన విక్రయ ప్రక్రియ, నకిలీ విత్తనాల నిర్మూలన తదితర అంశాలపై జిల్లాలోని విత్తన డీలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, విత్తనాల లేబుల్స్, కలర్ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే విత్తనాలు అమ్మాలని, గ్రామంలో విత్తనాలు విక్రయిస్తే నేరమని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గడువు ముగిసిన విత్తనాల బ్యాగులను పూర్తి స్థాయిలో స్టాక్ నుంచి తొలగించాలని, తనిఖీల సమయంలో గడువు ముగిసిన విత్తన బ్యాగులు విక్రయిస్తున్నట్లు దొరికితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. చిరిగిన విత్తనాల బ్యాగులను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించవద్దని కలెక్టర్ తెలిపారు. సబ్సిడీ ఉన్న విత్తనాలు అర్హులైన వారికి మాత్రమే విక్రయించాలని కలెక్టర్ తెలిపారు. విత్తనాల స్టోరేజ్ వద్ద నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, విత్తనాల స్టోరేజి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. లైసెన్స్ లేని డీలర్లు విత్తనాలు విక్రయించడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విత్తన షాపు విక్రయదారులు రిజిస్టర్ మెయింటెన్ చేయాలని , వారి లైసెన్స్ రెన్యువల్ దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. విత్తన షాపులో అందుబాటులో ఉన్న విత్తనాల స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నోటీస్ బోర్డ్ పై నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో ప్రభుత్వ నిబంధనల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని కలెక్టర్ ఆదేశించారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి జిల్లా స్థాయిలో పోలీసు, వ్యవసాయ , విత్తన ధ్రువీకరణ సంస్థల అధికారులతో టాస్క్‌హో ఫోర్స్ కమిటీని ఏర్పాటుహొచేస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అనుమతించిన కంపెనీ విత్తనాలను ప్యాకెట్లలో మాత్రమే విక్రయించాలని, ఎలాంటి కల్తీకి పాల్పడటానికి అవకాశం ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ పాస్ యంత్రాల ద్వారా మాత్రమే రైతులకు ఎరువులు విత్తనాలను అమ్మాలని, క్షేత్రస్థాయిలో అంతర్జాలం సమస్యలను పరిష్కరించి తప్పనిసరిగా ఈ పాస్ యంత్రాలు వినియోగించాలని డీలర్లకు కలెక్టర్ ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పోలీసు అధికారులు సమన్వయంతో ఎరువులు విత్తనాల షాప్ ల పై జాయింట్ తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా రసీదు పొందాలని, ఈ అంశాన్ని విస్తృతంగా రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బీటి 3 ప్రత్తి రకాల విత్తనాలకు చట్ట బద్ధత లేదని దీని వలన పర్యావరణం, మానవాళి జీవన శైలికి హాని చేకూరుతుందని, కావున ఎవరైనా ఈ విత్తనాలను విక్రయిస్తే వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాల వళ్ళ పంట నష్టం గురించి రైతుల నుండి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లి ఏసిపి మాట్లాడుతూ, నాణ్యమైన పంటలను పండించడానికి డీలర్ల పాత్ర ఎంతో ముఖ్యమని , చట్టాలకు భయపడే కాదు రైతుల విషయం లో తప్పు చేస్తే మనస్సాక్షి కూడా హెచ్చరిస్తుందని అన్నారు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీతో పాటు మండల స్థాయిలో స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, మండల వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయనున్నట్టు తెలియచేసారు. ఈ సమావేశంలో ఏసిపి కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి డి.ఆదిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల,డీలర్ లు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలి : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి




పెద్దపల్లి, మే -17: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టిన మౌలిక వసతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికల పోలింగ్ ను విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్ లు, ఇతర ఉన్నతాధికారులు, ప్రభుత్వ సిబ్బంది పోషించిన పాత్రను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపద్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు మంచి పురోగతి సాధించారని, దాదాపు ప్రతి ప్రభుత్వ పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీని ఏర్పాటు చేసి కనీస మౌళిక సదుపాయ పనులు గ్రౌండ్ చేయడం జరిగిందని సీఎస్ తెలిపారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన కనీస మౌళిక వసతుల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాలలను పున ప్రారంభించేందుకు మనకు మరో 20 రోజుల గడువు మాత్రమే ఉందని, ఆ లోగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని సిఎస్ కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బాలికల సంఖ్య ప్రకారం తప్పనిసరిగా ప్రత్యేకంగా టాయిలెట్లు ఉండాలని, వీటిని అత్యంత ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు పెయింటింగ్ వేయాలని, ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన చోట పెయింటింగ్ పనులు సైతం చేపట్టాలని, మంజూరు చేసి ఇప్పటి వరకు గ్రౌండ్ కాని పనులు త్వరితగతిన గ్రౌండ్ చేయాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూలు యూని ఫామ్ జిల్లాలకు చేరుతున్నాయని, ఇప్పటి వరకు 17 జిల్లాలకు బట్టలు చేరాయని, మరో 3 రోజులలో మిగిలిన జిల్లాలకు యూనిఫామ్ బట్టలు చేరతాయని సిఎస్ తెలిపారు. జిల్లాలో కుట్టు మిషన్లలో అనుభవం కలిగిన గుర్తించిన స్వశక్తి మహిళా సంఘాలకు స్కూల్ యూనిఫాంలు కుట్టే ఆర్డర్ అందించాలని సి.ఎస్. కలెక్టర్లకు సూచించారు. పాఠశాలలు పున ప్రారంభానికి ముందే విద్యార్థులందరికీ తప్పనిసరిగా యూనిఫారం లు అందించే విధంగా సన్నద్ధమయ్యేలా రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని సీఎస్ సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం లక్ష్యంగా మార్చి 15 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లక్షా 15 వేల దరఖాస్తులను పరిష్కరించామని, లోక్ సభ ఎన్నికల పోలింగ్ ముగిసినందున మరోసారి ధరణి దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ పునః ప్రారంభించాలని, మే చివరి నాటికి ధరణి పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, ధరణి దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు రెగ్యులర్ గా తహసిల్దారులతో సమావేశం నిర్వహించి గ్రామాల వారీగా పెండింగ్ సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన మార్పులు ధరణి మాడ్యుల్స్ లలో చేయడం జరిగిందని సీఎస్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులలో అధికంగా రెవెన్యూ, ధరణి సంబంధిత సమస్యలు అధికంగా వస్తున్నాయని, వీటిని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అన్నారు.

# త్వరితగతిన ధాన్యం తరలించాలి



వేములవాడ, మే 17, 2024: కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. రుద్రంగి మండలంలోని మానాల, సమీపంలోని తండాల వద్ద ఉన్న కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శుక్రవారం తడిసిన ధాన్యాన్ని, రిజిస్టర్లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని జాగ్రత్తగా తడవకుండా కింద, పైన టార్పలిన్ కప్పాలని నిర్వాహకులకు సూచించారు. లారీల కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే రుద్రంగి మండలకేంద్రంలోని రైస్ మిల్లు, వేములవాడ మండలం మర్రిపల్లి మిల్లులో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్లు, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.